

సింహాచల దేవాలయం ప్రాంగణము

# బహుమతి

**సివాచలం** సచ్చిపోయింది.

బసవరాజు గుండె ఆగిపోయినంత పనయింది.

తనకింకేమీ మిగల్లేదన్నాడు.

సివాచలం తనని అన్నాయం చేసిందన్నాడు.

తనింక బతికేంలాభం అన్నాడు.

తనూ సివాచలంతోపాటే పోతానన్నాడు.

అవునుమరి! ఎంత అన్నాయప్పని జరిగిపోంది?

సివాచలం లేని లోకంలో బసవరాజు ఒగ్గలడా?

బతుకులే ఏం చూసి బతుకుతాడు?

ఏం చేదామని బతుకుతాడు?

సివాచలం తనకేవిటి మిగిల్చిందని బతకాలి?

ఊహూఁ! తను బతకలేడు. సివాచలం లేని లోకంలో తను బతకలేడు.

"బసవరాజా!"

బసవరాజు తలెత్తి చూశాడు.

రత్తయ్యా, సింగితాతా లేచి నించున్నారు.

"బసవరాజా! రా పోదాం" అంటూ వాళ్లు అతని జబ్బ పట్టుకుని లేవనెత్తారు.

బసవరాజు లేచి నించున్నాడు. ఎదురుగా చితి మండుతోంది. సివాచలం శవం కాలిపోతోంది. ఎర్రటి మంట అతి భయంకరంగా ఉంది.

రాత్రి అఘోరంగా ఉంది.

అతి భయంకరంగా ఉంది.

అసహ్యకరంగా ఉంది.

కాలిపోతూన్న శవంమీదనుండి వచ్చే వాసన మరీ అసహ్యంగా ఉంది. భరించలేని దుర్వాసన!

దిక్కులేక, నిర్మానుష్యమైన ప్రదేశంలో పురుటి నొప్పులతో అతి భయంకరంగా అరుస్తూ బాధతో మెలికలు తిరిగిపోయే అనాథలాగా మంట మీదికి ఎగుస్తోంది. అర్ధరాత్రి మెలుకువ వచ్చి, అంతకు ముందే చచ్చిపోయిన తల్లి శవంమీద పడి పాలకోసం వెదికే పసిపాపలాగా నీలిరంగు మంట నాట్యం చేస్తోంది.

ఉత్తమ రచయిత హృదయోద్రేకంలాగా మీదిమీదికి ఎగబడుతున్నాయి జ్వలన జ్వాలలు! క్షణంలో ఆకాశం మేఘావృత మయింది.

హోరున గాలి వీచింది.

ఆకాశం ఒక్కసారి గర్జించింది, ఆకలిబాధకు తాళలేక సహనం కోల్పోయిన మహారాక్షసిలాగా!

బసవరాజు తుళ్లిపడ్డాడు.

తలెత్తి ఆకాశంవేపు చూశాడు.

చినుకులు మొదలయ్యాయి. రానురాను వర్షం పెద్దది కాసాగింది.

హోరుమంటూ గాలి...

అల్లంత దూరాన కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి... ఉండిఉండి మెరుపులు... మహా ప్రళయం వస్తోందా అన్నట్లుగా తయారయింది వాతావరణం.

చితి ఆరలేదు!

సివాచలం శవం కాలిపోతూనే ఉంది!

బసవరాజు హృదయం దహించుకు పోతూనే ఉంది!

చినుకులలో తడుస్తూ ఇళ్లకు బయలుదేరారు బసవరాజూ, రత్తయ్యా, సింగితాతా.

చింతచెట్టుకొమ్మ ఫెళఫెళమంటూ విరిగి పడిపోయింది నేలమీదికి.

వాళ్లు నడక వేగం హెచ్చించారు.

పదిన్నరకల్లా బసవరాజు ఇంటికి చేరారు.

రత్తయ్య సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

నీళ్లు కారుతూన్న బట్టలతోనే నులకమంచం మీద కూర్చున్నాడు బసవరాజు.

వాణ్ణిచూసి నిట్టూర్చాడు తాత.

సింగితాత తువ్వాలుతో తల ఒత్తుకున్నాడు.

తడిసిపోయిన తువ్వాలు తలుపుమీద ఆరవేసి బసవరాజు దగ్గిరికి వచ్చాడు.

"బసవరాజా! ఏడవకురా! ఏడ్చేం లాభం? సచ్చినోళ్లు తిరిగిరారుగందా? మగ మనిసివి, గుండె దిట్టపరచుకోవాల! నా కూతురునాంటి సివాచలం సచ్చిపోనాదంటే నాకుమాత్రం ఇసారం కాదూ? నా గుండెమాత్రం ముక్కలయిపోటం నేదూ?

ఏం సేస్తాం?

పోయినోళ్లు తిరిగి రారుగందా?

ఇసారించి ఊరుకోవాల.

ఈ నోకంలో ఎవరూ శాశతం కారుగదా? ఇయ్యాల ఉంటారు, రేపు పోతారు... ఇసారించకు.

సరే, బసవరాజా! నే పోయొస్తా... ఇంటికాడ మాయావిడ కానుకుర్చ్యకుంటది. రేపు పెందలకడనే వచ్చి కలుస్తా" అంటూ బయలుదేరాడు సింగితాత.

సింగితాత మలుపు తిరిగే వరకూ చూసి నిట్టూర్చాడు బసవరాజు.

గాలికి పూరింటిమీది తాటాకులు ఊడిపడ్డాయి.

ప్రకృతి మరొకసారి భయంకరంగా అరిచింది.

బసవరాజు భోరున ఏడ్చాడు.

వాడి కళ్లు వాచిపోయాయి.

జుట్టు పీక్కుంటున్నాడు.

"నా పేణం సచ్చిపోయింది!" వెర్రిగా ఆలోచిస్తున్నాడు బసవరాజు. 'పేణం నేని నేను సచ్చిన శవంతో సమానం ... శవంకి పెపంచకంతో పనినేదు. పెపంచకంతో పనినేని శవం సచ్చినా పరవానేదు... సచ్చిపోయిన శవాన్ని చూసి పెపంచకం ఇసారించదు. ఈడ్చి పారేస్తుందవతలికి...'

బసవరాజు వెర్రిగా ఆలోచిస్తున్నాడు.

వాడి మనస్సంతా కల్లోలంగా ఉంది.

కళ్లు ఎర్రగా చింతనిప్పుల్లా తయారయ్యాయి.

'సివాచలం! నన్నన్నాయం సేసావుగా! ఆగు! సివాచలం, ఆగాగు... వస్తున్నా... నేనూ వస్తున్నా.. నువ్వు లేని నోకంలో నే బతకనేను... వస్తున్నా...ఆగాగు..' వెర్రిగా అరుస్తూ పీక నులిమేసుకో నారంభించాడు.

ముఖం క్షణక్షణానికీ ఎర్రగా తయారయిపోతూంది.

బయట ప్రకృతి గర్జిస్తూనే ఉంది.

గాలి తీవ్రతకు తలుపులు కొట్టుకుంటున్నాయి.

దూరంగా కనుపిస్తున్న రావిచెట్టు ఫెళఫెళమంటూ విరిగిపోయింది!

బసవరాజు చేతులు మరింత వెర్రెత్తిపోతున్నాయి.

దూరంగా ఎక్కడో పెద్దపెట్టున పిడుగుపడింది.

పక్కింట్లో పాప కెవ్వుమంది.

ఆ అరుపు రెండు క్షణాల తరవాత బసవరాజు కర్ణపుటాలను తాకింది.

"పాపా!" హఠాత్తుగా అరిచాడు కెవ్వున.

పీకమీదనుంచి చేతులు తీసేశాడు.

'పాప! అవును, తన పాప! తన పాప అరుస్తోంది తన కోసం! సీ! ఎదవ బుద్ధి! ఎంతపని సెయ్యబోయింది? అమ్మో! పాపని ఇడిసి పోవటమే?

సరిగ్గా సవత్సరంన్నర కిందట...సివాచలం పాపను కంది. తరవాత సివాచలానికి పెద్ద జబ్బుసేసింది. బతకదనుకున్నాడు తను. అప్పుడు పాపని తన చేతికి అందిస్తూ ఆ బహుమతీ జాగ్రత్తగా కాపాడుకోమని కోరింది. కాని, తన అదృష్టం బాగా ఉండి, ఆనాడు సివాచలం బతికి బయట పడింది. కాని...కానీ ఈనాడు సివాచలం సచ్చిపోయింది. తను, తను బతికి ఉన్నాడు, సచ్చిన శవం నాగా. తన పాప! ఆనాడు సివాచలం బహుమతిగా తనకిచ్చిన పాప, సచ్చిపోలేదు.

తన అయిదో పేణం మిగిలే ఉంది!

లేదు! తను సచ్చిపోకూడదు! సివాచలం తనకి అన్నాయం సేసినా, తను సివాచలానికి అన్నాయం సేయకూడదు!' బసవరాజు కళ్లనీళ్లు నేలమీద పడ్డాయి జలజలమంటూ...

పాపను తీసుకురావటానికి పక్కింటికి బయలుదేరాడు బసవరాజు... ★

జోగ్